క్లుప్తంగా

అబ్బిరాజుపాలెం రేవు వేలం పాట ఖరారు



అబ్బిరాజుపాలెం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన రేవు పాట

యలమంచిలి: మండలంలోని అబ్బిరాజుపాలెం వద్ద వశిష్ఠ గోదావరి నదిలో పంటు తిప్పేందుకు శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో రేవు పాట నిర్వహించగా గ్రామానికి చెందిన చేగొండి సత్యనారాయణ రూ.3.47 లక్షలకు పాట దక్కించుకున్నారు. సర్పంచ్ కామిశెట్టి సాయిబాబు అధ్యక్షతన డిప్యూటీ ఎంపీడీఓ జక్కంశెట్టి దేవార్క్ వెంకట ప్రసాద్ పర్యవేక్షణలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.ప్రసాద్ రేవు పాట నిర్వహించారు. అబ్బిరాజుపాలెం గ్రామానికి చెందిన చేగొండి సత్యనారాయణతోపాటు ఏనుగువానిలంక గ్రామానికి చెందిన వినుకొండ లక్ష్మీ రూ.25 వేలు ధరావతు చెల్లించి వేలంలోపాల్గొన్నారు. 30జూన్ 2026వరకు పాట కాలానికి గానూ, లైసెన్స్‌ఉన్న పంటు మాత్రమే తిప్పాలనే నిబంధనతో రేవు పాట నిర్వహించారు.

క్షీరారామలింగేశ్వరుని ఆలయ ట్రస్ట్ బోర్డు నియామకం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక క్షీరారామలింగేశ్వర స్వామి (పెద్ద గోపురం) దేవస్థానం ట్రస్ట్ బోర్డు నియామకపు ఉత్తర్వులు శుక్రవారం వెలువడ్డాయి. పది మందిని సభ్యులుగా నియమిస్తూ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. సభ్యులుగా మీసాల రామచంద్రరావు, ఉప్పలపు దుర్గా పెద్దిరాజు, నాళం నాగ వెంకట సురేక, పినిశెట్టి శ్రీనివాస్, కొండ్రెడ్డి సూర్యనారాయణ, పెన్మత్స శ్రీదేవి, బాసిన అప్పల నాగ సత్యనారాయణ, వాండ్రపు కుమారి, నీలాపు సింహాచలం, నీలాపు మణి సభ్యులుగానూ, అర్చకులు సన్నిధిరాజు రామకృష్ణమూర్తి ఎక్స్ అఫిసియో సభ్యుడిగా నియమితులయ్యారు.

స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలి



మాట్లాడుతున్న కౌరు పెద్దిరాజు

నరసాపురం రూరల్: విద్యుత్ చార్జీలను మరింత పెంచే స్మార్ట్ మీటర్లను ప్రజలంతా తిరస్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం లక్ష్మణేశ్వరం గ్రామంలో ఆ పార్టీ సభ్యులకు నిర్వహించిన మండల స్థాయి శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రజలపై మోయలేని భారాన్ని వేశారని అన్నారు. ఇప్పటికే ఇందన సర్దుబాటు చార్జీలు,ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల మేర విద్యుత్ బిల్లులు పెంచారని విమర్శించారు. మళ్లీ స్మార్ట్ మీటర్లు బిగించి విద్యుత్ చార్జీలు మరింత పెంచే ప్రయత్నం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో విద్య, వైద్యం సామాన్య ప్రజలకు కొంతమేరకు అందుబాటులో ఉండేవని ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల విద్య,వైద్యం వ్యాపార సరుకులుగా మారిపోయాయన్నారు. శిక్షణా తరగతులకు సీపీఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు గుబ్బల నాగేశ్వరరావు, బొక్క శ్రీనివాసరావు, కడలి నాగరాజు, సట్టేటి సుబ్రహ్మణ్యం, పిల్లి కామేశ్వరరావు, గుత్తుల శ్రీరామచంద్రుడు, యాండ్ర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా మహాసభలు వాయిదా

పెనుగొండ: పెనుగొండలో ఈ నెల 17 నుంచి 19 వరకూ నిర్వహించ తలపెట్టిన సీఐటీయూ జిల్లా మహాసభలు వాయిదా వేస్తున్నట్లు జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్, ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహనరాయ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సభలను అక్టోబరులో నిర్వహిస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే తేదీలు ప్రకటిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులంతా హిందీ భాషను నేర్చుకోవాలి

భీమవరం: విద్యార్థులంతా హిందీ భాషను నేర్చుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రచారక్ వనమా శ్రీకాంత్ అన్నారు. భీమవరం వీరమ్మ పార్క్‌లోని తెలుగు తల్లి విగ్రహం వద్ద శుక్రవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ భాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా హిందీ భాష రెండవస్థానంలో ఉందని, దాదాపుగా 3,372 భాషలను దేశ ప్రజలు మాట్లాడుతున్నప్పటికీ 24 అధికార భాషలను గుర్తించినప్పటికీ జాతీయ భాషగా హిందీనే భావిస్తున్నామన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 14న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని 24 మంది హిందీ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా సత్కరిస్తామన్నారు.

ప్లాస్టిక్‌తో పెరుగుతున్న అపారిశుద్ధ్యం

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

నరసాపురం రూరల్: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగంపై ఎక్కడా అడ్డుకట్ట పడడం లేదు. ఒకప్పుడు పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా వినియోగించే పాలిథిన్ సంచుల వినియోగం గ్రామీణ ప్రాంతాల్లోనూ నేడు విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఎటు చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలతో అధ్వానంగా తయారవుతున్నాయి. నరసాపురం మండలంలో లక్ష్మణేశ్వరం, రుస్తుంబాద, సరిపల్లి, కొప్పర్రు, పాతనవరసపురం, కొత్తనవరసపురం, లిఖితపూడి, వేములదీవి తదితర గ్రామాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వీటిపై నిషేధం ఉన్నప్పటికీ అధికారులెవ్వరూ స్పందించకపోవడం విశేషం. దీంతో గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పల తెప్పలుగా కనిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి

లక్ష్మణేశ్వరం గ్రామంలో అయితే ప్రధాన రహదారి పైనే ఇక్కడ చెత్త వేయవద్దంటూ పంచాయతీ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు వద్దే చెత్తను వేస్తున్నా ఆ దారిన పోయే అధికారులు సైతం పట్టించుకోవడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో? అర్థం చేసుకోవచ్చు. రుస్తుంబాద గ్రామ సచివాలయం సమీపంలో రహదారి పక్కనే చెత్తను డంపింగ్ చేసి నిప్పు పెడుతున్నారు. లిఖితపూడి, సరిపల్లి తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారి పక్కన సైతం ప్లాస్టిక్ వ్యర్థాలు విచ్చలవిడిగా కనిపిస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా మేల్కొని ప్రజల్లో చైతన్యం తీసుకురాకుంటే రానున్న రోజుల్లో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని పలువురు పర్యావరణ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రుస్తుంబాదలో సచివాలయ సమీపంలో రోడ్డు పక్కన పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన చెత్త



లక్ష్మణేశ్వరం ప్రధాన రహదారి పక్కనే అధ్వానంగా దర్శనమిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

నిషేధం ఉన్నా ఆగని వైనం

పర్యావరణానికి ముప్పు తెచ్చే ప్లాస్టిక్ వినియోగంపై కేంద్ర ప్రభుత్వం గతంలో చర్యలు చేపట్టింది. గతంలో చేపట్టిన ఈ చర్యల్లో భాగంగా 20 మైక్రాన్ల కన్నా తక్కువగా ఉన్న పాలిథిన్ ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని నిషేధించింది. ఇది అమల్లోకి వచ్చి ఏళ్ల గడిచినప్పటికీ నేటికీ ఇది అమలు కావడం లేదు. నిత్యావసర సరుకులు చేరవేత నుంచి ఆహార పొట్లాల వరకు ప్రతీ పనికి పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ సామగ్రి వినియోగం తప్పనిసరైంది. పాలిథిన్ సంచుల్లోని ఆహారాన్ని వాటితో పాటు పారవేస్తే మూగ జీవాలు ఆ సంచులతో కలిపి తినడంతో ఆ జీవాల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది.

డంపింగ్ యార్డు నిరుపయోగం



గ్రామంలో చాగంటివారిమెరక వంతెన సమీపంలో డంపింగ్‌యార్డు, షెడ్డు నిర్మించి ఉన్నాయి. అయినా అధికారులు, ప్రజా ప్రతినిధులు అలసత్వం కారణంగా చెత్తను దిగువ ప్రాంతాల ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే పంటకాలువ వెంబడి వేస్తున్నారు. పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పంటకాలువలో కలుస్తున్నాయి. అధికారులు ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– కోలపర్తి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణేశ్వరం

చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తగులబెడుతున్నారు



గ్రామంలో సచివాలయం రోడ్డులోనే చెత్త నుంచి సంపద కేంద్రాన్ని నిర్మించారు. అయినా దాన్ని వినియోగించడం లేదు. సేకరించిన చెత్తలో ఎక్కువశాతం ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. చెత్త బాగా పెరిగి దుర్వాసన వస్తుంటే నిప్పుపెడుతున్నారు. ప్లాస్టిక్ వినియోగంపై అవగాహనను తీసుకురాకుండా ఇలా చేయడం సరికాదు. అప్పుడప్పుడు ప్లాస్టిక్ వినియోగం వద్దంటూ ర్యాలీలు చేయడమే తప్ప ఆదిశగా చర్యలు శూన్యం.

– పిల్లి మనోహరం, రుస్తుంబాద

స్కాలర్‌షిప్‌ల పంపిణీ



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న సూర్యప్రసాద్

యలమంచిలి: స్థానిక జూనియర్ కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ చదువుకుని గ్రూపు టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులకు ప్రతి ఏడాదీ తాళ్లూరి వెంకట నారాయణ ఎడ్యుకేషనల్ స్కాలర్‌షిప్‌లు పేరిట ఆయన కుమార్తె డాక్టర్ తాళ్లూరి సీతాదేవి (ఎన్‌ఆర్‌ఐ) ఒక్కో విద్యార్థికి రూ.25 వేలు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్నారు. ఈ క్రమంలో 2023–25 విద్యా సంవత్సరం ఎంపీసీలో 948 మార్కులు సాధించిన బి.నవ్య తేజ దుర్గకు, బైపీసీలో 963 మార్కులు సాధించిన జి.శైలజకు, సీఈసీలో 739 మార్కులు సాధించిన ఎల్.నిరూషకు శుక్రవారం ఒక్కొక్కరికి రూ.25వేలు చప్పున చెక్కులను కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ తాళ్లూరి సూర్యప్రసాద్, సభ్యులు తాళ్లూరి కిషోర్, యలమంచిలి సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా అందజేశారు. స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులు ఇంటర్ తరువాత కూడా డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసన్ ఇలా ఏం చదువుకున్న మళ్లీ 60 శాతం మార్కులు సాధిస్తే మరొక రూ.25 వేలు అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.కనకదుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు

నరసాపురం: రోటరీ క్లబ్ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎల్లూరి కల్యాణచక్రవర్తి చెప్పారు. శుక్రవారం ఆయన నరసాపురం క్లబ్‌ను సందర్శించి క్లబ్ ద్వారా నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక అంజుమన్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది క్లబ్ ద్వారా విద్య, ఆరోగ్యం విషయాల్లో పెద్దపీట వేస్తూ పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో క్లబ్‌లు పరింత పటిష్టం చేస్తున్నామని వివరించారు. శిబిరంలో 150 మందికి కళ్లజోళ్లు, మందులు ఉచితంగా అందించామని, 20 మందికి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించి, వారికి ఆపరేషన్‌లు చేయిండానికి నిర్ణయించామని క్లబ్ నరసాపురంశాఖ అధ్యక్షురాలు ఆత్మూరి రమ చెప్పారు. లెప్రసీ ఆసుపత్రిలో పిల్లలకు పళ్లు, పాలు, బిస్కెట్‌లు పంపిణీ చేశారు. సంజూస్ ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కేజేఎస్‌ఎల్ కుమారి, ట్రెజరర్ వి.సమత, తోట శ్రీనివాసబాబు, సలాది రామారావు, బ్రహ్మాజీ, తోట సర్దార్, ఆకుల రవి పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నరసాపురం: వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ నరసాపురం శాఖ డిమాండ్ చేసింది. శుక్రవారం సచివాలయ ఉద్యోగులు నరసాపురం ఆర్డీఓ దాసి రాజును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్లతో గతంలో చేయించిన పనులు ఇప్పుడు తమతో చేయిస్తున్నారని వాపోయారు. దీనివల్ల క్షేత్రస్థాయిలో ఇబ్బందులు, అవమానాలు పడుతున్నామని పేర్కొన్నారు. ఇంటింటికీ తిరిగి చేసే పనులు అప్పగించడం మానాలని డిమాండ్ చేశారు. ఇంక్రిమెంట్స్ వెంటనే ఇవ్వాలని, ఆరేళ్ల ఒకే కేడర్‌లో సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరసాపురం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు పాల్గొన్నారు.



ఆర్డీవో దాసి రాజుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నేడు జాతీయ లోక్ అదాలత్

నరసాపురం: స్థానిక కోర్టు సముదాయంలో శనివారం జాతీయలోక్ అదాలత్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పదో అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి చెప్పారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేసుల రాజీకి రెండు బెంచ్‌లు ఏర్పాటు చేసినట్టు స్పష్టం చేశారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేసుల రాజీకి దరఖాస్తు చేసుకున్న కక్షిదారులు ఎవరూ గైర్హాజరు కాకుండా, చక్కగా కేసులు పరిష్కరించుకుని వెళ్లాలని చెప్పారు. వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా సంబంధిత శాఖల వారు సహకరించాలని కోరారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలం

ఉండి: మన పరిసరాల పరిశుభ్రతే మన ఆరోగ్యానికి మూలమవుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ పి.సునంద అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉండి బీసీ బాలుర హాస్టల్‌ను వైద్య బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా డాక్టర్ సునంద మాట్లాడుతూ హాస్టల్ అంతా పరిశుభ్రంగా ఉందని గదులన్నీ పరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. కానీ వాడకం నీరు నిలిచి ఉందని దాని ద్వారా దోమల వ్యాప్తి జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. కాబట్టి నీరు నిలువ ఉండకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి మంచి ఆదరణ

నరసాపురం రూరల్: వైఎస్సార్‌సీపీకి గ్రామాల్లో మంచి ఆదరణ ఉందని, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావాలని పార్టీ శ్రేణులకు వైఎస్సార్ సీపీ కేంద్ర పాలకమండలి సభ్యుడు పీడీ రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని మల్లవరం వైఎస్సార్‌సీపీ గ్రామకమిటీ ఎన్నిక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకిత భావంతో పని చేసే వారికి పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మల్లవరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మల్లవరం గ్రామశాఖ అధ్యక్షుడిగా పులఖండం మాధవరావు, ప్రధాన కార్యదర్శులుగా పీతల రాజు, గోడి వెంకటేశ్వర్లు, సిర్రా రాజు, గూడూరి భరత్‌సింగ్, కార్యదర్శులుగా కొండేటి వెంకట్రావు, గంటా విజయ్, ముమ్మిడి వరపు బైరాజు, గోగులమండ బాసు, కార్యవర్గ సభ్యులుగా బందెల చిట్టిబాబు, కొక్కిరిగెడ్డ ఏసు, బూసి చిట్టిబాబు, సిర్రా శ్యాంబాబు, సింధూరపు పెదపండు, కొయ్యే సుదర్శన్, వడ్డి రాజబాబు, బుంగా చిన వెంకట్రావు, జెల్లెళ్ల చిట్టిరాజు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు యూత్ గ్రామ అధ్యక్షుడిగా దీపాటి మూర్తి రాజు, రైతు విభాగం గ్రామ అధ్యక్షుడిగా నల్లిమిల్లి రాజు, ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షుడిగా బుంగా రాజేష్, బీసీ సెల్ గ్రామ అధ్యక్షుడిగా గూడూరి సతీష్, మహిళా గ్రామ అధ్యక్షురాలిగా బుంగా కవలమ్మ, మేధావుల ఫోరమ్ అధ్యక్షుడిగా పిల్లి అశోక్‌లు ఎన్నికయ్యారు. వీరందరినీ పార్టీ నాయకులు అభినందించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఉంగరాల రమేష్‌నాయుడు, ఎంపీపీ మైలాబత్తుల సోనీల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దొండపాటి వెంకట్, ఒడుగు సత్యనారాయణ, పులపర్తి ప్రతాప్, మైలాబత్తుల శ్రీను, కడలి రాంబాబు, అద్దాల నర్సింహరావు, కంకటాల పెద్దిరాజు, ఇంజేటి జాన్‌కెనడీ పాల్గొన్నారు.



మల్లవరంలో నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

నిబంధనలకు విరుద్ధంగా కాలువల తవ్వకం



మండలపరిషత్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం




హాజరైన ప్రజా ప్రతినిధులు

నరసాపురం రూరల్: ఇటీవల పంటకాలువలు, మురుగు డ్రెయిన్‌ల తవ్వకం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని నరసాపురం జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ ఆరోపించారు. కాలువలు తవ్వామని కూటమి ప్రభుత్వం గొప్పగా చెప్పుకోవడానికే ఈ పనులు ఉపయోగపడతాయని ఎద్దేవా చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మైలాబత్తుల సోనీ అధ్యక్షతన మండలపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడి ఆరోపణలకు ఇరిగేషన్, డ్రైనేజి ఏఈలు శ్రీనివాసరావు, పావణ్యలు వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అలాగే మండలానికి మంజూరైన పనులు వివరాలను పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, విద్యా, ఆరోగ్యశాఖ, వెలుగు, అధికారులు నాగేశ్వరరావు, లోకేష్, పుష్పరాజ్యం, చిరంజీవి, ప్రసన్న, నాగభూషణ నాయుడు తదితర అధికారులు సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. గ్రామాల్లోని స్థానిక సమస్యలపై ఎంపీటీసీ సభ్యులు నక్కా లక్ష్మీనారాయణ, పులపర్తి రాంబాబు, సత్యనారాయణ, చిన్నం వెంకట్రావు, శీలం హరికృష్ణ, రామకృష్ణ, తదితరులు మాట్లాడారు. సర్పంచ్‌లు దొండపాటి వెంకట్, పులపర్తి బ్రమరాంబ, తాడి లక్ష్మణరావు గొట్టుముక్కల సుజాత, బొక్కా రామస్వామి, చిమ్మిలి నాగమల్లేశ్వరరావు తదితరులు గ్రామాల్లో నెలకొన్న తాగు నీరు, డ్రెయినేజీ తదితర సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు విడుదల చేయాలని కోరారు. మంజూరైన వివిధ శాఖలకు చెందిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసి నిధులను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు రాధాకృష్ణ సూచించారు. వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, ఎంపీడీవో వీరభద్రరావు, ఈవోపీఆర్డీ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం మాటున పొంచి ఉన్న ప్రమాదం

పెనుగొండ: సాధారణంగా కాలువ గట్లపై వర్షాకాలంలో పచ్చదనంతో ఆహ్లాదాన్ని ఇస్తాయి. అయితే ఈ పచ్చదనం మాటున పెను ప్రమాదం ఉంటుందని ఎవరూ ఊహించరు. ముఖ్యంగా విద్యుత్ స్తంభాల చుట్టూ పెరిగిన పొదలు, విద్యుత్ తీగలపై ఎగబ్రాకిన పొదుల తీగలు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. పెనుగొండ మార్టేరు, పెనుగొండ ఐతంపూడి రహదారిలో నరసాపురం కాలువ పొడవునా విద్యుత్ స్తంభాల కింద గుబురు పొదలు విపరీతంగా పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. వీటి వద్ద పుట్టుకొస్తున్న నాటు దొండ, ఇతర పిచ్చి పాదులు స్తంభాల చుట్టూ పెరిగిపోయాయి. దీంతో అవి తీగలపై విద్యుత్ లతల్లా తయారయ్యాయి. ఇటీవల వరుస ముసుర్లతో పాదులు మరీ పెరిగిపోయాయి. విద్యుత్ శాఖ ప్రతి వారం ఒక్కో ప్రాంతంలో నిర్వహణ పనులు చేపడుతూ పెరిగిన పిచ్చిమొక్కలు, పొదులను తొలగిస్తూ ఉంటుంది. అయితే పెనుగొండ మార్టేరు, పెనుగొండ ఐతంపూడి రహదారిలో వీటిని తొలగించడం ఎక్కువ కాలం కావడంతో మరీ గుబురు పొదలు పెరిగిపోయాయి. దీంతో వర్షం పడినపుడు వీటి పక్కగా వెళ్లడానికి వాహనదారులు భయపడిపోతున్నారు.



పెనుగొండ అయితంపూడి రహదారిలో విద్యుత్ స్తంభంపై అల్లుకొన్న పాదులు

పెరుగుతున్న భయం

ఈ పాదుల వల్ల విద్యుత్ ప్రమాదాలకు అవకాశం ఉండడంతో ఇబ్బందికరంగా మారింది. అదే విధంగా విద్యుత్ సరఫరాకు ఈ విద్యుత్ తీగలు అంతరాయంగా మారుతుంది. ఏమాత్రం గాలి అధికంగా వీచినా నిప్పులు వస్తున్నాయి. దీంతో ప్రజలు హడలిపోతున్నారు. విద్యుత్ సమస్యలతో పాటు పెరిగిన పొదలతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. వీటిని తొలగించడం ఆయా పంచాయతీలకు సైతం అదనపు భారంగా మారుతుండడంతో గాలికి వదలివేస్తున్నారు. దీంతో రోడ్డు వరకూ గుబురు పొదలు వ్యాపించాయి. ఇవీ వాహనదారులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. గుబురు పొదలు రోడ్డుపైకి చేరడంతో రహదారి ఇరుకుగా మారుతుంది. ఇదే పరిస్థితి వెంకట్రామపురం వద్ద నెలకొంది. సుమారు రెండు అడుగులకు పైగా రోడ్డుపైకి చేరడంతో రహదారి వెడల్పు తగ్గిపోయి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. పెనుగొండ మార్టేరు, పెనుగొండ ఐతంపూడి, పెనుగొండ వెంకట్రామపురం, వడలి మధ్యలో గుబురు పొదలు మరీ ఎక్కువగా పెరిగిపోయాయి. అధికారులు స్పందించి వీటిని తొలగించి విద్యుత్ సమస్యలు, రహదారి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



పెనుగొండ పెట్రోల్ బంక్ సమీపంలో ఇలా



పెనుగొండ మార్టేరు రహదారిలో ఇలా

నానో యూరియాపై అవగాహన

కాళ్ల: నానో యూరియాను పంట ఆకులపై పిచికారీ చేయడం ద్వారా మొక్కల పత్రహరితానికి నేరుగా చేరుతుందని కాళ్ల మండల వ్యవసాయ అధికారి పి.రమేష్ నాయుడు తెలిపారు. మండలంలోని కోపల్లె గ్రామంలో నానో యూరియాపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 కిలోల బస్తాలో ఉండే పోషకాలు అరలీటర్ నానో యూరియాలో ఉంటాయన్నారు. నానో యూరియా 30 నానో మైక్రాన్‌ల ఘనపరిమాణం ఉంటుందని, 80 శాతానికి పైగా మొక్కకు చేరుతుందన్నారు. దీని ద్వారా ఎరువు వృథా కాలుష్యం తగ్గుతుందన్నారు. అనంతరం యూరియాపై అవగాహన కల్పిస్తూ రైతులతో మానవహారం నిర్వహించారు.